కేసు వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ సన్ ప్రీత్ సింగ్

చోరీ కేసులో ఐదుగురి అరెస్టు

- 6.5తులాల బంగారం, 30తులాల వెండి స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఎస్పీ సన్ ప్రీత్ సింగ్

బొడ్రాయిబజార్, సెప్టెంబర్ 24 : డెకాయిటీ కేసులో సైంటిఫిక్ ఆధారాలతో కేసును ఛేదించి నిందితుల నుంచి రూ. 1.62లక్షల విలువైన 6.5తులాల బంగారం, 12వేల విలువైన 30తులాల వెండి, ఇన్నోవా కారుతో పాటు 5 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకొని నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసుకు సంబంధించిన వివరాలను ఆయన వెల్లడించారు. మేళ్లచెర్వు మండల శివారు వెల్లటూరు కాలనీలో ఈ నెల 19న తెల్లవారుజామున ఐదుగురు దొంగలు బ్రిక్స్ వ్యాపారి తమ్మిశెట్టి వెంకన్న నివాస ఇనుప ప్లేట్ కట్ చేసి ఇంట్లోకి చొరబడి వెంకయ్య, ఇద్దరు కుమార్తెలను బెదిరించి 6.5తులాల బంగారం, వెండి ఆభరణాలు, రూ.50వేల నగదు ఎత్తుకెళ్లారు. వెంకయ్య ఫిర్యాదు మేరకు మేళ్లచెర్వు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు కాగా.. ఏఎస్పీ నాగేశ్వర్‌రావు, కోదాడ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో 7 పోలీస్ బృందాలుగా ఏర్పడి గాలింపు మొదలు పెట్టారు. ఈ నేపథ్యంలో అనంతగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఖమ్మం ఎన్‌హెచ్ 365పై శాంతినగర్ వద్ద మంగళవారం ఉదయం పోలీసుల వాహనాల తనిఖీల్లో ఐదుగురు దుండగులు పట్టుబడ్డారు. ఆంధ్రప్రదేశ్ ఎన్టీఆర్ జిల్లాకు చెందిన వేమవరపు నాగరాజు, వేమవరపు పుల్లారావు, భిక్షాలు, నల్లగొండ జిల్లాకు చెందిన రమావత్ మాత్య, నాగర్ కర్నూల్ జిల్లాకు చెందిన చిక్కల ఆంజనేయులుగా గుర్తించి అదుపులోకి తీసుకొని విచారించగా మేళ్లచెర్వు నేరం ఒప్పుకున్నారు. నాగరాజు మల్లారెడ్డిగూడెంలో ఇటీవల ఓ పెళ్లికి వచ్చి వెళ్తుండగా మార్గమధ్యంలో మేళ్లచెర్వులో కొళ్ల వ్యాపారి వేముల వెంకటేశ్వర్లుతో పరిచయం ఏర్పడి స్నేహితులయ్యారు. డబ్బు కోసం దొంగతనం చేయాలని నిశ్చయించుకున్న నాగరాజు సలహా ఇవ్వాలని వెంటకేశ్వర్లును అడిగాడు. దీంతో బ్రిక్స్ వ్యాపారి వెంకయ్య ఇంట్లో చోరీ చేస్తే రూ.30లక్షల డబ్బు దొరుకుతుందని తెలుపడంతో స్నేహితులతో కలసి చోరీకి పాల్పడ్డాడు. ఇంట్లోకి చొరబడగానే ముందుగా సెల్‌ఫోన్లు లాక్కున్న నాగరాజు గ్యాంగ్.. చోరీ పూర్తయ్యాక వాటిని ఇంటి ఆవరణలో పడేసి బయట నుంచి గడియ పెట్టి పారిపోయారు. వెంకయ్య కుమార్తె ఇంట్లో మరో ఫోన్‌తో పక్కింటి వారికి తెలుపగా.. వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఆటో డ్రైవర్ ఇచ్చిన సమాచారం ఈ కేసులో కీలకంగా మారిందని ఎస్పీ ఆయన్ను సన్మానించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ నాగేశ్వర్‌రావు, కోదాడ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి, సీఐ రజితారెడ్డి, మేళ్లచెర్వు ఎస్ఐ పరమేశ్, అనంతగిరి ఎస్ఐ నవీన్, కోదాడ రూరల్ ఎస్ఐ అనిల్‌రెడ్డి, చింతలపాలెం ఎస్ఐ సైదిరెడ్డి, సీసీఎస్ సిబ్బంది, ఐటీ సెల్ సిబ్బంది, సబ్ డివిజన్ టెక్నికల్ టీంను ఎస్పీ అభినందించి రివార్డులు అందించారు.

అర్ధరాత్రి దారి దోపిడీ

- బైక్‌పై వెళ్తున్న వ్యక్తిని ఆపి దాడి
- రూ.8వేలు అపహరణ, సెల్‌ఫోన్ ధ్వంసం

నేరేడుచర్ల, సెప్టెంబర్ 24 : నేరేడుచర్ల మండలంలోని పెంచికల్‌దిన్న గ్రామ శివారులో దుండగులు సోమవారం రాత్రి బైక్‌పై వెళ్తున్న వ్యక్తిని అడ్డగించి దాడి చేసి అతడి వద్ద ఉన్న రూ.8వేల నగదును ఎత్తుకెళ్లారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కల్లూరు గ్రామానికి చెందిన సిరికొండ నవీన్ నేరేడుచర్ల మున్సిపల్ రహదారిలో పెయింటింగ్ షాప్ నడుపుతున్నాడు. సోమవారం రాత్రి షాప్ మూసేసి తన బైక్‌పై ఇంటికి వెళ్తుండగా మార్గమధ్యంలో పెంచికల్‌దిన్న గ్రామ సమీపంలోకి రాగానే రెండు బైక్‌లపై నలుగురు దుండగులు వచ్చి నవీన్‌ను ఆపారు. కల్లూరు గ్రామానికి దారి ఎటు? అని అడుగుతూనే దగ్గరికి వచ్చి జేబులో ఉన్న నగదును లాక్కునే ప్రయత్నం చేశారు. నవీన్ నిరాకరించడంతో తీవ్రంగా కొట్టి అతడి వద్ద నున్న రూ.8వేల నగదును తీసుకొని కొద్ది దూరం వెళ్లి మళ్లీ తిరిగి వచ్చి సెల్‌ఫోన్ లాక్కొని ధ్వంసం చేశారు. నవీన్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. ఈ ఘటనపై నేరేడుచర్ల, పాలకవీడు, గరిడేపల్లి ఎస్ఐలు రవీందర్, నరేశ్, లక్ష్మీనర్సయ్య పరిసర ప్రాంతాల్లోని సీసీ కెమేరాలు పరిశీలిస్తూ నిందితుల ఆచూకీ కోసం గాలిస్తున్నారు. తీవ్రంగా గాయపడిన నవీన్ దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. సంఘటనా స్థలాన్ని హుజూర్‌నగర్ సీఐ చరమందరాజు పరిశీలించారు.

తీవ్రంగా గాయపడిన నవీన్

ఇరువర్గాల ఘర్షణలో ఆస్తులు ధ్వంసం

మద్దిరాల, సెప్టెంబర్ 24 : మండల కేంద్రంలో ఇరువర్గాల ఘర్షణలో సోమవారం అర్ధరాత్రి ఒకరి ఆస్తులను ఒకరు ధ్వంసం చేసినట్లు కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన వల్లపు లింగయ్య, వల్లపు వెంకన్న అన్నదమ్ములు. వారికి తమ వ్యవసాయ భూమి పక్కనున్న నవుళ్ల మల్లారెడ్డితో గత 15 ఏండ్లుగా భూ తగాదాలున్నాయి. ఈ విషయంలో ఇరువురు కోర్టును ఆశ్రయించిగా వాదోపవాదాలు సాగుతున్నాయి. గతేడాది లిటికేషన్ ఉన్న భూమిలో మల్లారెడ్డి ఇల్లు నిర్మించుకున్నాడు. ఈ నేపథ్యంలో ఈనెల 23న అర్ధరాత్రి మల్లారెడ్డి ఇంటిపై గుర్తుతెలియని వ్యక్తులు దాడిచేసి పూర్తిగా నేలమట్టం చేశారు. దీంతో తనపై దాడి చేసింది లింగయ్య, వెంకన్న సోదరుల కుటుంబ సభ్యులేనని మల్లారెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అదే విధంగా వల్లపు వెంకన్న వ్యవసాయ భూమి వద్ద ఉన్న జేసీబీ, మహింద్ర బొలేరో వాహనాలను గుర్తు తెలియని వ్యక్తులు పెట్రోల్ పోసి నిప్పంటించగా పూర్తిగా కాలిపోయాయి. ఈ ఘటనకు మల్లారెడ్డే కారకుడని వల్లపు వెంకన్న పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రెండు ఘటనా స్థలాలు పక్కపక్కనే ఉన్నాయి. వాటిని తుంగతుర్తి సీఐ శ్రీను, మద్దిరాల ఎస్ఐ వీరన్న పరిశీలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. 2023 నవంబర్ నెలలో కూడా నవుళ్ల మల్లారెడ్డి ఇంటిపై వల్లపు సోదరులు దాడిచేయగా హత్యయత్నం కింద జైలు శిక్ష కూడా అనుభవించినట్లు తెలిసింది.

పూర్తి నేలమట్టమైన నవుళ్ల మల్లారెడ్డి ఇల్లు

పూర్తిగా కాలిపోయిన వల్లపు వెంకన్న జేసీబీ

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

ప్లాటు అమ్మబడును
సూర్యాపేట, తాళ్ళగడ్డలో 356 చ।।గ, (32 ఫీట్స్/100 ఫీట్స్) 3 ఫేస్ రోడ్స్ గల ప్లాట్ అమ్మకమునకు గలదు. చ।।గ।। 20K ఆసక్తి గలవారు సంప్ర।।9666592626.
NLG-

BUSINESS OFFER
★మీరు ఒక దుకాణదారా? మీకు ప్రతినెలా ఆదాయం కావాలా? మీ దుకాణానికి ప్రచార ప్రకటనలు జోడించి ప్రతినెలా 7,000/- ఇస్తాము. Ph: 9948000371, 9948000373.
NT-338751-All

WANTED
★త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. 9160900024 / 9640400073.
NT-331774-All

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రభుత్వంచే ముందు తగిన లీడిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం... మన "నమస్తే తెలంగాణ" క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం...
ప్రతి 4 లైన్ల క్లాసిఫైడ్‌కు 200/-
ప్రతి అదనపు లైన్‌కు 50/-
Note: 3+1 Scheme Available
Minimum 4 Lines,
Extra Line - Extra Amount
5% GST అదనం
నమస్తే తెలంగాణ యూనిట్ కార్యాలయం,
గ్రా॥ చర్లపల్లి, మం॥ సల్లగూడ.
సల్లగూడ : 9182777626 | సల్లగూడ : 9182777635 | దేవరకొండ : 9182777635
హాలియా : 9182777059 | సూర్యాపేట : 9182777630 | భువనగిరి : 9182777638
మిర్యాలగూడ : 9182777059 | కోదాడ : 9182777630 | తొలుకట్ట : 9182777630

విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలి

- కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

చివ్వెంల, సెప్టెంబర్ 24 : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని, ఇంగ్లిష్ నేర్చుకోవడంలో ఉన్న భయాలను తొలగించాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. మండల కేంద్రంలోని బీబీ గూడెం శ్రీ చైతన్య పాఠశాలలో జాలి ఫోనిక్స్ శిక్షణ కేంద్రాన్ని మంగళవారం ఆయన ప్రారంభించి 5 మండలాల డివిజన్ స్థాయి ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. శిక్షణలో నేర్చుకున్న మెళకువలను తరగతి గదిలో అమలు పర్చాలని సూచించారు. విద్యార్థుల్లో కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందించాలన్నారు. కార్యక్రమంలో డీఈఓ అశోక్, క్వాలిటీ టి కోఆర్డినేటర్ దేవరశెట్టి జనార్దన్, అధికారులు గోపాల్‌రావు, ఎస్‌వీ గోమతి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మేళ్లచెర్వు, సెప్టెంబర్ 24 : మండలంలోని కందిబండ సబ్‌స్టేషన్‌లో ఓవర్‌లోడ్ కారణంతో మరమ్మతులు చేస్తున్న నేపథ్యంలో సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో బుధవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనున్నట్లు ఏఈ వెంకటేశ్వర్‌రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. అంతరాయానికి విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ఆక్టోబర్ 3 నుంచి 13వరకు దేవీ నవరాత్రోత్సవాలు

నేరేడుచర్ల, సెప్టెంబర్ 24 : పట్టణంలోని విజయదుర్గ ఆలయంలో అక్టోబర్ 3 నుంచి 13 వరకు దేవీ నవరాత్రోత్సవాలు నిర్వహించడానికి మంగళవారం ఆలయ కమిటీ ప్రముఖులతో సమావేశం నిర్వహించారు. ఆలయం నిర్మించి 12 ఏండ్లు పూర్తయిన సందర్భంగా ఈ సారి ఘనంగా నిర్వహించనున్నట్లు కమిటీ చైర్మన్ కొణతం ఆదిరెడ్డి, ప్రధాన కార్యదర్శి కొణతం చిన్న వెంకట్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నాగండ్ల శ్రీధర్ తెలిపారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ బచ్చలకూరి ప్రకాశ్, మార్కెట్ వైస్ చైర్మన్ తాళ్ల సురేశ్‌రెడ్డి, రాచకొండ రామ్మోహన్‌రావు, కొణతం కృష్ణారెడ్డి, చిత్తనూరి సత్యనారాయణ, నాగరమాధవరావు, గణేశ్‌రెడ్డి, గోపాల్ రెడ్డి ఉన్నారు.

ధరణి ఉద్యోగుల సంఘం నుంచి ఆపరేటర్ జగదీశ్ తొలగింపు

నేరేడుచర్ల/హుజూర్‌నగర్, సెప్టెంబర్ 24 : ప్రభుత్వ భూమిని అక్రమంగా తన కుటుంబ సభ్యుల పేరు మీదికి మార్చిన విషయంలో ధరణి ఆపరేటర్ వత్సవాయి జగదీశ్‌పై వచ్చిన ఆరోపణలు రుజువు కావడంతో ఆయన్ను ధరణి ఉద్యోగుల సంఘం నుంచి తొలగిస్తున్నట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చెన్నగాని పురుషోత్తం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ధరణి ఉద్యోగులం దరూ 2018 నుంచి నేటి వరకు చిత్తశుద్ధితో పని చేస్తున్నట్లు తెలిపారు. జీతాలు సరిగా రాకున్నా ప్రభుత్వం మీద నమ్మకంతో విధులను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కొంత మంది స్వార్థపూరితంగా చేసిన తప్పులకు మిగిలిన ఉద్యోగులందరిని అదే కోణంతో చూడవద్దని కోరారు.

విద్యుత్ షాక్‌తో రైతు మృతి

సతీశ్‌రెడ్డి (ఫైల్)

మఠంపల్లి, సెప్టెంబర్ 24 : మండలంలోని రఘునాథపాలెంలో మంగళవారం విద్యుదాఘాతంతో రైతు మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన త్రిపురం సతీశ్‌రెడ్డి (36) కొంత భూమిని కౌలుకు తీసుకొని వ్యవసాయ చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నేపథ్యంలో మంగళవారం మధ్యాహ్నం విద్యుత్ మోటార్‌ను ఆన్ చేయడానికి వెళ్లగా షాక్ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సతీశ్‌రెడ్డికి భార్య, ఇద్దరు కుమారులున్నారు. మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. భార్య అరుణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వీరాంజనేయులు తెలిపారు.

నిద్రిస్తున్న మహిళ మెడలో నుంచి పుస్తెలతాడు చోరీ

సూర్యాపేట రూరల్, సెప్టెంబర్ 32 : పట్టణ పరిధిలోని 11వార్డు రాయిన్‌గూడెంలో నిద్రిస్తున్న మహిళ మెడలో నుంచి సోమవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు బంగారు పుస్తెలతాడును చోరీ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మామిడి సాలమ్మ, కోడలు మామిడి శివాని వరండాలో నిద్రిస్తున్నారు. సుమారు 1.15 నిమిషాలకు గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు ఇంట్లోకి చొరబడి శివాని మెడలో ఉన్న సుమారు 3 తులాల బంగారు పుస్తెలతాడును ఎత్తుకెళ్లారు. శివాని కేకలు వేయడంతో చుట్టుపక్కల వాళ్లు వచ్చేటప్పటికీ దొంగలు పారిపోయారు. శివాని ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ బాలూనాయక్ తెలిపారు.

ప్రభుత్వ జూనియర్ కాలేజీలో అడ్మిషన్ గడువు పొడిగింపు

తిరుమలగిరి, సెప్టెంబర్ 24 : పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అడ్మిషన్ల గడువును పొడిగించినట్లు ప్రిన్సిపాల్ రాజామోహన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ గ్రూపుల్లో చేరే విద్యార్థులు ఈనెల 30వ తేదీ వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

కాంట్రాక్టర్లకు బిల్లులు రాకనే ఆగిన అభివృద్ధి

- మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నపూర్ణ

సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ అన్నపూర్ణ

బొడ్రాయిబజార్, సెప్టెంబర్ 24 : గతంలో ప్రభుత్వం నుంచి పట్టణ ప్రగతి, ఎస్‌డీఎఫ్ నిధులు మున్సిపాలిటీకి మంజూరు కాగా పనులు చేసిన కాంట్రాక్టర్లకు బిల్లులు రాక అభివృద్ధి పనులు నిలిచిపోయాయని మున్సిపల్ చైర్ పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సాధారణ కౌన్సిల్ సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం వెంటనే నిధులు మంజూరు చేసి పట్టణాభివృద్ధికి తోడ్పాటునందించాలని కోరారు. సమస్యలను అధికారులు, పాలకవర్గం దృష్టికి తీసుకొస్తే వెంటనే పరిష్కరిస్తామన్నారు. కౌన్సిలర్లు వార్డుల వారీగా సమస్యలు తెలుపగా అధికారులు సమాధానం చెప్పారు. మంచినీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అనంతరం అజెండాలో పొందుపర్చిన 13అంశాలను ఆమోదించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాస్, వైస్ చైర్మన్ పుట్ట కిశోర్, మున్సిపల్ ఈఈ కిరణ్, ఆయా వార్డుల కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

తుది దశకు ఎడమ కాల్వ గండి పూడిక పనులు

గండి పడిన ప్రాంతంలో జరుగుతున్న పనులు

నడిగూడెం, సెప్టెంబర్ 24 : నాగార్జునసాగర్ ఎడమకాల్వ కట్టకు పడిన గండి పూడిక పనులు చివరి దశకు చేరుకున్నాయి. భారీ వర్షాలకు సెప్టెంబర్ 1న కాగితారామచంద్రాపురం సమీపంలోని 132 కిలోమీటర్ల వద్ద సాగర్ కాల్వ కట్ట తెగిన విషయం తెలిసిందే. గండి పూడికకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణ సాయం కింద రూ.2.10 కోట్లను విడుదల చేసింది. ఆలస్యంగా ఈ నెల 15వ తేదీ నుంచి పనులు ప్రారంభమయ్యాయి. గండి ప్రాంతంలో 6 మీటర్ల లోతు 26 మీటర్ల వెడల్పుతో సిమెంట్ బెడ్డింగ్ వేసి, మట్టి బ్యాకింగ్ పనులు చేసినట్లు అధికారులు తెలిపారు. 150 మీటర్ల పొడువు 6.1 మీటర్ల ఎత్తులో చేపట్టిన కట్ట నిర్మాణ పనులు సోమవారం సాయంత్రం నాటికి 5.3 మీటర్ల ఎత్తు వరకు చేరాయి. మరో రెండు, మూడ్రోజుల్లో పనులు పూర్తి చేయనున్నట్లు సమాచారం. నూతనంగా నిర్మించిన కట్ట మరోసారి కోతకు గురవ్వకుండా ఇసుక బ్యాగులు ఏర్పాటు చేశారు. మంత్రి ఉత్తమ్ ఆదేశాలతో 128.24 కిలోమీటర్ వద్ద క్రాస్ బండ్ (మట్టికట్ట) నిర్మించి ఆదివారం అధికారులు సాగునీటిని విడుదల చేశారు. ఇదిలా ఉండగా ఎడమ కాల్వకు గండి పడడంతో కాగితారామచంద్రాపురం గ్రామం వద్ద 300 ఎకరాలు నీట మునగ్గా.. 24 రోజుల పాటు సాగునీరు లేక అదే గ్రామంలో మరో 300 ఎకరాలు ఎండిపోయాయి. ఆదివారం నుంచి నీటి విడుదల చేసినప్పటికీ గండి పడిన ప్రాంతంలోని పాలాలకు నీరు అందాలంటే మరో ఐదు రోజులు పట్టే అవకాశం ఉందని రైతులు అంటున్నారు. ఎండిన పంటలకు కూడా పరిహారం చెల్లించి ఆదుకోవాలని రైతులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

స్వచ్ఛత అందరి బాధ్యత : మున్సిపల్ కమిషనర్

మఠంపల్లి : మొక్క నాటుతున్న ఎంపీడీఓ శ్రీనివాస్, అధికారులు

హుజూర్‌నగర్, సెప్టెంబర్ 24 : స్వచ్ఛత అందరి బాధ్యత అని మున్సిపల్ కమిషనర్ యాకూబ్ పాష అన్నారు. స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంలో భాగంగా మంగళవారం పట్టణంలోని గ్రీన్‌వుడ్ పాఠశాల విద్యార్థులకు పారిశుధ్యంపై అవగాహన కల్పించారు.

విరివిగా మొక్కలు నాటాలి : ఎంపీడీఓ

మఠంపల్లి : పర్యావరణ పరిరక్షణ కొరకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఎంపీడీఓ బాణాల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని సాంఘీక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో మంగళవారం మొక్కలు నాటారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి సుధాకర్, ప్రిన్సిపాల్ మంజుల, ఏపీఓఉమ తదితరులున్నారు.

పారిశుధ్య కార్మికులకు సన్మానం

నేరేడుచర్ల : మండలంలోని పెంచికల్‌దిన్న, ముకుందాపురం గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికులను ఎంపీడీఓ సోమసుందర్‌రెడ్డి, ఎంపీఓ హరిసింగ్ సన్మానించారు. అనంతరం ముకుందాపురం ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు వివిధ రకాల గేమ్స్ నిర్వహించి బహుమతులు అందించారు. కార్యక్రమంలో హెచ్ఎం వెంకటేశ్వర్లు ఉన్నారు.

తిరుమలగిరి : మున్సిపాలిటీ పరిధిలోని అనంతారం మోడల్ స్కూల్‌లో మున్సిపల్ కమిషనర్ బుచ్చిబాబు మొక్కలు నాటారు.

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెంలో పంచాయతీ సిబ్బందిని జడ్పీసీఈఓ అప్పారావు సన్మానించారు. తిమ్మాపురంలో సామాజిక ఆరోగ్య అధికారి బిచ్చూనాయక్ అధ్వర్యంలో పంచాయతీ సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఇన్‌చార్జి డీపీఓ నారాయణరెడ్డి, ఎంపీడీఓ పవన్‌కుమార్, డాక్టర్ నగేశ్, ఎంపీఓ ఉపేందర్, కార్యదర్శి నెహ్రూ పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు పెండింగ్ పీఎఫ్ చెల్లించాలి : సీఐటీయూ

మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న పారిశుధ్య కార్మికులు

బొడ్రాయిబజార్, సెప్టెంబర్ 24 : మున్సిపాలిటీలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులకు పెండింగ్ పీఎఫ్, ఈఎస్ఐలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నెమ్మాది వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులు మంగళవారం మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడించి ధర్నా చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు, మున్సిపల్ పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం : సీఐ చరమందరాజు



హుజూర్‌నగర్ రూరల్ : కర్రకాయల గూడెంలో క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న సీఐ చరమందరాజు

హుజూర్‌నగర్‌రూరల్, సెప్టెంబర్ 24 : క్రీడలతో మానసికోల్లాసం పెంపొందుతుందని హుజూర్‌నగర్ సీఐ చరమందరాజు, ఎంఈఓ సైదానాయక్ అన్నారు. మండలంలోని కర్రకాయల గూడెంలో అండర్-14, 17 విద్యార్థులకు మంగళవారం నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలను వారు ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో ఎంఈఓ ఛత్రూనాయక్, దేవిశెట్టి రవి, నాగేంద్రర్, అప్పయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మండల స్థాయి క్రీడలు ప్రారంభం

అర్వపల్లి : మండలంలోని జాజిరెడ్డిగూడెం ఉన్నత పాఠశాలలో మండల స్థాయి క్రీడోత్సవాలను మంగళవారం ఎంఈఓ బాలూనాయక్ ప్రారంభించి మాట్లాడారు. అలాగే 8వ తరగతి చదివే పేద విద్యార్థులకు టీపీయూఎస్ అధ్వర్యంలో ఎన్ఎంఎంఎస్ మెటీరియల్స్ అందజేశారు. కార్యక్రమంలో సంధ్యారాణి, పీడీలు మల్లేశ్, సైదులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మృతురాలి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి

మృతురాలి కుటుంబానికి మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి పరామర్శ

చివ్వెంల, సెప్టెంబర్ 24 : మండల పరిధిలోని వట్టి ఖమ్మంపహాడ్ గ్రామానికి చెందిన మట్టిపెల్లి నర్సమ్మ(65)ఇటీవల ఆనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి మంగళవారం మృతురాలి చిత్రపటానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు సత్యం, సంజీవనాయక్, నర్సింహారావు, సత్యనారాయణరెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, సుధాకర్‌రెడ్డి, బాబూనాయక్, దస్తగిరి, సైదులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినిని దూషించిన ప్రిన్సిపాల్

- ప్రైవేట్ పాఠశాల ఎదుట తల్లిదండ్రుల ఆందోళన

నారాయణ పాఠశాల ఎదుట ఆందోళన చేపడుతున్న విద్యార్థిని తల్లిదండ్రులు, బంధువులు, పీడీఎస్‌యూ నాయకులు

సూర్యాపేటఅర్బన్, సెప్టెంబర్ 24 : పాఠశాల ప్రిన్సిపాల్ తమ కుమార్తెను అసభ్య పదజాలంతో దూషించిందని ఆరోపిస్తూ తల్లిదండ్రులు, బంధువులు, పీడీఎస్‌యూ నాయకులతో కలిసి మంగళవారం ఓ ప్రైవేట్ పాఠశాల ఎదుట ఆందోళన చేశారు. జిల్లా కేంద్రంలోని నారాయణ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థినిని ప్రిన్సిపాల్ అసభ్య పదజాలంతో దూషించినట్లు తల్లిదండ్రులు చెప్పున్నారు. ఇటీవల పాఠశాల ఎన్నికల్లో సదరు విద్యార్థినికి లీడర్ అయ్యేందుకు అర్హతలున్నప్పటికీ కాకుండా అడ్డుకున్నదని, మరో ఆరుగురు విద్యార్థినులను కూడా ప్రిన్సిపాల్ టార్గెట్ చేసినట్లు వారు పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ వైఖరితో విద్యార్థులు పాఠశాలకు వెళ్లేందుకే భయపడుతున్నారని వాపోయారు. పీడీఎస్‌యూ నాయకులు, తల్లిదండ్రుల ఆందోళనతో పాఠశాల ఎదుట ఉద్రిక్త వాతావరణం నెలకొన్నది. పోలీసులు కలుగ జేసుకొని సర్ది చెప్పే ప్రయత్నం చేసినా ఫలితం లేకుండా పోయింది. తక్షణమే డీఈఓ స్పందించి పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై ప్రిన్సిపాల్‌ను వివరణ కోసం ప్రయత్నించగా అందుబాటులో లేరు. పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కిరణ్, సింహాద్రి, పిడమర్తి భరత్ ఆందోళనలో పాల్గొన్నారు.

వివాహేతర సంబంధానికి అడ్డొస్తున్నాడని హత్య

- భర్తను చంపిన భార్య

కేసు వివరాలు వెల్లడిస్తున్న రూరల్ సీఐ సురేందర్‌రెడ్డి

సూర్యాపేట రూరల్, సెప్టెంబర్ 24 : వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని భర్తను తానే హతమార్చి.. మద్యం సేవించి కింద పడి చనిపోయాడని నమ్మించిన భార్య ఉదంతం కుమారుడి ఫిర్యాదుతో వెలుగులోకి వచ్